క్లుప్తంగా

క్రికెట్ టోర్నీ ప్రారంభం

శాంతినగర్: పట్టణంలో వెలసిన ఎల్లమ్మ దేవత ధ్వజస్తంభ ప్రతిష్ఠ, పరుశరామ విగ్రహ ప్రతిష్ఠలో భాగంగా ఏర్పాటు చేసిన ఓపెన్ టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేశారు. మంగళవారం బీఆర్‌ఎస్ రాష్ట్ర యువజన నాయకులు డాక్టర్ అజయ్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. క్రీడాస్ఫూర్తితో ఆడాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

విద్యా సామర్థ్యాలను మెరుగుపరచాలి

మానవపాడు: విద్యార్థుల సామర్థ్యాలను మెరుగుపరచాలని స్కూల్ కాంప్లెక్స్ సెక్రెటరీ రవీందర్ అన్నారు. మంగళవారం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జల్లాపురంలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులకు పాఠ్యంశాలు అర్థమయ్యేలా బోధించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మాధవి, వేణుగోపాల్, లక్ష్మన్న, అమరేందర్‌రెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం



అయిజ: పట్టణంలోని సుబ్బణాచారి ఆయన సతీమణి లీలావతి జ్ఞాపకార్థం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థినులకు నగదు అందజేశారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 2021–22లో పదో తరగతిలో పాఠశాల మొదటి ర్యాంక్ సాధించిన చంద్రకళకు రూ. 12 వేలు, రెండో స్థానం సాధించిన గీతారాణికి రూ.5వేలు, మూడో స్థానం సాధించిన రేణుకకు రూ. 3వేల నగదును దాత సుబ్బణాచారి అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మల్లేష్, ఉపాధ్యాయ బృందం శేషఫణిశర్మ, సర్వేశ్వరాచారి, కృష్ణమోహన్‌రెడ్డి, లక్ష్మయ్య, బీచుపల్లిగౌడ్, శ్రీధరాచారి, విద్యార్థినులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉర్సు



ధరూరు: మండలంలోని నెట్టెంపాడులో మూడు రోజులుగా హజ్రత్ మహబూబ్ సుభానీ ఉర్సు ఉత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం నడిగడ్డ రైతు హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగ్లల రంజిత్ కుమార్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో కన్వీనర్ బుచ్చిబాబు, కార్యదర్శి లవన్న, మల్దకల్ మండల అధ్యక్షుడు విష్ణు, సభ్యులు గోవిందు, రామాంజనేయులు, గోపాల్, వెంకట్రాములు, జగదీష్, హనుమంతు, పరుశరాముడు, గుండన్న, శ్రీను, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.


దరఖాస్తు చేసుకోండి

కేటీదొడ్డి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన కార్డుకు దరఖాస్తు చేసుకోవాలని జోగుళాంబ గద్వాల జిల్లా సీఎస్‌ఈ మేనేజర్ శ్రీకాంత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన వారు అందరూ మీసేవ, కామన్ సర్వీస్ సెంటర్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. దీంతో ఉచితంగా రూ. 5 లక్షల వరకు ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం చేసుకోవచ్చని వివరించారు.

అందరికి కంటి పరీక్షలు చేయాలి

ఎర్రవల్లిచౌరస్తా: వయస్సుతో సంబంధం లేకుండా కంటి వెలుగులో అందరికి కంటి పరీక్షలు చేయాలని మంగళవారం ఇటిక్యాల తహసీల్దార్ సుబ్రమణ్యంకు బీఎస్పీ నాయకుడు రాంబాబు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ రాజకీయం కోణంలో కాకుండా 18 సంవత్సరాల లోపు ఉన్న వారికి కంటి పరీక్షలు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దుబ్బన్న, రాజు, బీసన్న ఉన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



గద్వాల అర్బన్: ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని మంగళవారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవనంలో అంబేడ్కరిస్టు వేమన్న ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా మాచర్ల ప్రకాష్, ఉపాధ్యక్షుడిగా సల్కాపురం ఆంజనేయులు, భాస్కర్, నాగేష్, ప్రధాన కార్యదర్శి సుధాకర్, జాయింట్ సెక్రటరీగా రేపల్లె లక్ష్మణ్, పరుశరాముడు తదితరులను ఎన్నికయ్యారు.

బాలికల పరిరక్షణే ధ్యేయం

● ఘనంగా జాతీయ బాలిక దినోత్సవం



రాజోళిలో ర్యాలీ ప్రారంభిస్తున్న బాలికలు, అధికారులు

కేటీదొడ్డి: బాలికల పరిరక్షణ అందరి బాధ్యత అని చైల్డ్‌లైన్ జిల్లా సమన్వయకర్త శివలీల అన్నారు. మంగళవారం మండలంలోని మహిళ శిశు సంక్షేమ శాఖ కమిటీ ఆధ్వర్యంలో కేజీబీవీ పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా చైల్డ్‌లైన్ సేవలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, సెల్‌ఫోన్‌తో కలిగే అనర్థాలు తదితర అంశాలపై అవగాహన ఉండాలని వక్తలు పేర్కొన్నారు. ఏదైన సమస్య ఎదురైతే 1098కి కాల్ చేయాలని, బాల్య వివాహాల సమాచారం తెలిస్తే సఖి సెంటర్ 181 కాల్ చేయాలని సూచించారు. అదేవిధంగా ఎస్టీ బాలికల గురుకుల పాఠశాలలో ఎంపీపీ మనోరమ హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంఈఓ సురేష్, ఏఎస్‌ఐ వెంకటేష్‌గౌడ్, భరోసా టీం సభ్యులు కవిత, సంధ్య, లక్ష్మీదేవి, చైల్డ్‌లైన్ సభ్యులు లక్ష్మీ, ఐసీడీసీ సూపర్‌వైజర్ సురేఖ, సఖి టీం స్వాతి, విజయలక్ష్మి, పాఠశాల ఎస్‌ఓ పద్మావతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గట్టు: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో జాతీయ బాలిక దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథిగా సర్పంచ్ ధనలక్ష్మి హాజరై మాట్లాడుతూ బాలికలు బాగా చదివి ఉన్నత స్థానంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండలంలోని కలుగోట్ల కస్తూర్బా పాఠశాలలో బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలు చేసిన నృత్యాలు అందరిని అలరించాయి. పలు క్రీడా పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఓ పరిమళ, పీఈటీ అరుణ తార, తదితరులు పాల్గొన్నారు.

రాజోళి: ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవం మండల కేంద్రంలో విద్యార్థినులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జోషి శ్రీనివాస్ శర్మ, ఎంపీడీఓ గోవిందు రావు మాట్లాడుతూ బాలికలు బాగా చదివి ఉన్నత స్థానంలో స్థిరపడాలన్నారు. కార్యక్రమంలో ఎంవీ ఫౌండేషన్ మండల ఇన్‌చార్జ్ హనిమిరెడ్డి, ఉప సర్పంచ్ గోపాల్, నిర్మలజ్యోతి, నాగపుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



ఉండవెల్లి కలుగోట్ల పాఠశాలలో..



గట్టులోని కేజీబీవీ పాఠశాలలో..



కేటీదొడ్డిలో మాట్లాడుతున్న ఎంపీపీ మనోరమ

వైభవంగా విగ్రహాల ఊరేగింపు



జములమ్మ, పరుశరాముడి ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

అయిజ: మండల కేంద్రంలో మంగళవారం జములమ్మ, పరుశరాముడి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రధానరోడ్లపై ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. మేళతాళాలతో, భాజా భజంత్రీలతో మధ్య ఊరేగింపు ఆలయం వరకు కొనసాగింది. ఏరువాక పౌర్ణమి వరకు ప్రతి మంగళ, శుక్రవారాలు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.

దివ్యాంగులకు అండగా ప్రభుత్వం

గట్టు: దివ్యాంగులకు అండగా ప్రభుత్వం ఉందని ఎంపీపీ విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని అంతంపల్లి గ్రామానికి చెందిన దివ్యాంగులు అయిన కుందేటి నాగలక్ష్మి, హనుమంతుల దంపతులకు ప్రభుత్వం నుంచి మంజూరైన చెక్కును ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రభుత్వం జీవనోపాధి నిమత్తం 80 శాతం సబ్సిడీ పథకాలు అందజేస్తుందన్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచు ఆంజనేయులు, సెడ్రిక్, గోవిందు పాల్గొన్నారు.

ఉపన్యాస పోటీల్లో విద్యార్థి ప్రతిభ



కె. బిందు

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని కొండేరు జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థి కె. బిందు జిల్లా స్థాయిలో నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో ఉత్తమ ప్రతిభను కనబర్చి ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని బాలభవన్‌లో మంగళవారం నిర్వహించిన నేటి ఓటర్ పరిస్థితి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు అనే అంశంపై నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో విద్యార్థి కె. బిందు ఉత్తమ ప్రతిభను కనబర్చి జిల్లాలో మొదటి బహుమతిని అందుకుంది. అనంతరం విద్యార్థిని బిందును హెచ్‌ఎం సువార్తమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

ప్రభుత్వ తీరుపై ఏబీవీపీ నిరసన



నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులు

గద్వాల అర్బన్: ప్రభుత్వం విద్యారంగం సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఏబీవీపీ స్టేట్ జాయింట్ సెక్రటరీ సతీష్ అన్నారు. మంగళవారం ప్రభుత్వ తీరుపై జిల్లా కేంద్రంలోని పాతబస్టాండులో ఏబీవీపీ ఆధ్వర్యంలో నాయకులు మానవహారంతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ. 2.200 కోట్ల స్కాలర్‌షిప్స్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, ఇంజనీరింగ్ ఫీజులను తగ్గించాలని, గురుకులాలో మౌలిక వసతులను కల్పించాలని కోరారు. ఉద్యోగాలు లేక నిరుద్యోగులు రోడ్డుపై పడ్డారని విమర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అశోక్, శ్వేతా, జిల్లా కన్వీనర్ సురేష్, నగర కార్యదర్శి గణేష్, తేజ, వినోద్, ఓంకార్ తదితరులు ఉన్నారు.

డబుల్ ఓట్ల పరిశీలన



ఓటరు జాబితాను పరిశీలిస్తున్న అధికారులు

ఉండవెల్లి: డబుల్ ఓట్లను తొలగిస్తామని తహసీల్దార్ వీరభద్రప్ప అన్నారు. మంగళవారం మండలంలోని ఆయా గ్రామాల్లో ఆయన పర్యటించి రెండు ఓట్లు ఉన్న ఓటర్లను గుర్తించారు. మండలంలో 422 ఓట్లు రెండు ప్రాంతాలలో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. 151 మంది డబుల్ ఓట్లు ఉన్న ఓటర్ల వద్దకు వెళ్లి ఓటు ఎక్కడ ఓటు వేస్తారో అభిప్రాయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఉండవెల్లి, పుల్లూరు, తక్కశిల, ప్రాగటూరు తదితర గ్రామాల్లో ఓటర్ల జాబితాను రెవెన్యూ అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జయమ్మ, ఆర్ఐ లక్ష్మిరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ రజనీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పునరావాసంలో మౌలిక వసతులు కల్పించాలి



మాట్లాడుతున్న మహేష్

రాజోళి: మండల కేంద్రంలోని పునరావాసంలో మౌలిక వసతుల కల్పించడంలో ప్రభుత్వం విఫలం అయ్యిందని బీఎస్పీ అలంపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు మహేష్ అన్నారు. మంగళవారం ఆయన కార్యకర్తలతో కలిసి పునరావాసంలో పర్యటించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కొత్త రాజోళిలో వరద బాధితుల కోసం నిర్మించిన గృహాలు నేటికి అసంపూర్తిగా ఉన్నాయని, చాలా మందికి అసలు ఇళ్లే రాలేదని, ఏళ్ల తరబడి వరద బాధితులు పాతబడిన గృహాల్లోనే ఉన్నారన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రవి చందర్, ఉపాధ్యక్షుడు యామని సుంకన్న, మండల అధ్యక్షుడు సుందర్ రాజ్, కన్వీనర్ వెంకటేష్, లక్ష్మన్న, జలేందర్, ప్రవీణ్, ఇమ్మానియేల్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రెండు గేదెలు మృతి

గద్వాల క్రైం: రెండు గేదెలు మృతి చెందిన సంఘటన మండలంలోని అనంతపురం గ్రామ శివారులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు అనంతపురం గ్రామానికి చెందిన ఆంజనేయులు మంగళవారం గేదెలను వ్యవసాయ పొలానికి తీసుకెళ్తున్నాడు. గద్వాల నుంచి ఎర్రవల్లి వైపు వెళ్తున్న డీసీఎం గేదెలను ఢీ కొన్నది. ఈ ప్రమాదంలో రెండు గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. రెండు గేదెల విలువ రూ. .50 లక్షల వరకు ఉంటుందని బాధితుడు తెలిపారు.

ఘనంగా భక్త మార్కండేయ జయంతి



రాజోళిలో మార్కండేయ స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

రాజోళి: భక్త మార్కండేయ జయంతిని మండల కేంద్రం రాజోళిలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆ సంఘం యువకులు, పెద్దలు, మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పద్మశాలీయుల అభ్యున్నతికి, సంఘం అభివృద్ధికి యువకులు కలిసి కట్టుగా పని చేయాలని, సంఘం సహకారంతో అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. ప్రతి ఒక్కరు విద్యావంతులై, ఉన్నత స్థాయికి ఎదగాలని కాంక్షించారు. కార్యక్రమంలో పూజారి అడివి స్వామి, పద్మశాలియుల యువకులు పాల్గొన్నారు.

సకాలంలో ఆస్తి పన్ను చెల్లించాలి

అయిజ: మున్సిపాలిటీ పరిధిలో ఆస్తిపన్ను సకాలంలో చెల్లించాలని, చెల్లించని వారిపై చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ నర్సయ్య హెచ్చరించారు. మంగళవారం మున్సిపల్ సిబ్బందితోపాటు మున్సిపల్ కమిషనర్ పట్టణంలోని వివిధ వార్డుల్లో ఆస్తిపన్ను వసూలు చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా గమిషనర్ మాట్లాడారు. ఒక రోజులో రూ. 1,29,714 ఆస్తిపన్ను వసూలు చేసినట్లు తెలిపారు. ఆస్తిపన్ను బకాయిలను చెల్లించి అపరాదపు రుసుము పడకుండా చూసుకోవాలని కోరారు. ఆర్థిక సంవత్సరం ముగింపుకు దగ్గరపడుతోందని, పాత బకాయిలు ఎక్కువగా ఉన్నవారిపై దృష్టిసారించి ఆస్తిపన్ను వసూళ్లు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆర్థిక సంవత్సరం చివరి నాటికి నూరు శాతం ఆస్తిపన్ను వసూలు చేయాలని పలు సలహాలు, సూచనలు చేశారు. అదేవిధంగా పట్టణంలోని కొత్త బస్టాండ్‌లో చేపట్టిన రోడ్డు డివైడర్, సెంటర్‌లైటింగ్ నిర్మాణం పనులను ఏఈ గోపాల్‌తో కలిసి పరిశీలించారు.



ఆస్తిపన్ను వసూలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్ నర్సయ్య

వెదజల్లే పద్ధతితో అధిక దిగుబడి

పెబ్బేరు: యాసంగిలో వెదజల్లే పద్ధతి, డ్రమ్‌సీడర్ విధానంలో వరి సాగు చేస్తే అధిక దిగుబడులు వస్తాయని మంగళవారం మండలంలోని జనుంపల్లిలో రైతులకు వ్యవసాయ అధికారులు సూచించారు. ఈ సందర్భంగా ఆధునిక వ్యవసాయంపై శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు పలు సూచనలు చేశారు. వ్యవసాయ అధికారులు సూచించిన మోతాదులోనే పంటలకు ఎరువులను వేయాలన్నారు. కార్యక్రమంలో ఏఓ చంద్రమౌళి, ఏఈఓ నరేష్, రైతులు చెన్నయ్య పాల్గొన్నారు.

ఆంగ్ల భాషపై పట్టు సాధించాలి



జల్లాపురంలో మోడల్ తరగతి గదిని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సరిత

మానవపాడు: ప్రతి విద్యార్థి ఆంగ్ల భాషపై పట్టు సాధించాలని జిల్లా జెడ్పీ చైర్ పర్సన్ సరిత అన్నారు. మంగళవారం మండలంలోని జల్లాపురంలో మోడల్ క్లాస్ రూమ్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఆంగ్లంపై పట్టు సాధిస్తే ప్రతి సబ్జెక్ట్‌లో విజయం సాధిచడం సులువు అవుతుందన్నారు. పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించి జిల్లాలోనే అగ్రగామిగా నిలవాలని పేర్కొన్నారు. ఆంగ్ల వ్యాకరణం సంబంధించి పెయింటింగ్ వేయించాలని పేర్కొన్నారు. మోడల్‌రూమ్‌కు సహకరించిన ఉపాధ్యాయులు వెంకన్న, అమరేందర్‌రెడ్డి, మురళీధర్, సురేష్ తదితరులను ఆమె అభినందించారు. కార్యక్రమంలో మాధవీ, వేణుగోపాల్, లక్ష్మన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంటల నమోదు తప్పనిసరి



కొర్విపాడులో పప్పుశనగ పంటను పరిశీలిస్తున్న సక్రియానాయక్

మానవపాడు: యాసంగిలో రైతులు సాగు చేసిన పంటల వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని అలంపూర్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు సక్రియానాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కొర్విపాడు, పెద్దపోతులపాడు, చిన్నపోతులపాడు గ్రామాలలో ఆయన పంటలను సందర్శించారు. పప్పుశనగ పంటలను పరిశీలించి రైతులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం సక్రియానాయక్ మాట్లాడుతూ యాసంగి సాగైనా పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామన్నారు. పప్పుశనగ పంట 5నుంచి 6 క్వింటాళ్లు దిగుబడి వస్తుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రాజమోహన్, రైతు చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ ఫామ్ సాగుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న హార్టికల్చర్ అధికారి రాజశేఖర్

రాజోళి: మండలంలోని తూర్పుగార్లపాడులో ఆయిల్ ఫామ్ పంటలు సాగు చేసే విధానం, సబ్సిడీపై రైతులకు హార్టికల్చర్ అధికారి రాజశేఖర్ అవగాహన కల్పించారు. మంగళవారం ఏఈఓ ఇబ్రహీం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఆయిల్ ఫామ్ మొక్కకు రూ.20 లు అందిస్తుందని, ఎకరాకు 50 మొక్కలు నాటుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం, బీసీలకు 90 శాతం, జనరల్ రైతులకు 80 శాతం సబ్సిడీతో డ్రిప్ ఇరిగేషన్ అందిస్తుందన్నారు. కార్యక్రమంలో యశ్వంత్, రైతులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కంటి వెలుగు



గద్వాలలో అద్దాలను అందజేస్తున్న మనస్విని



మల్దకల్ వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణయ్య

గద్వాల అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రెండో విడత కంటి వెలుగు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ మనస్విని అన్నారు. మండలంలోని సంగాలలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన కంటి వెలుగులో మొత్తం 688 మందికి పరీక్షలు నిర్వహించారు. అందులో 166 మందికి అద్దాలను అందజేశారు. వీరాపురంలో బుధవారం కంటివెలుగు నిర్వహిస్తామని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో వైద్యుడు రాజు, సూపర్‌వైజర్ విజయ భాస్కర్, ఏఎస్‌ఎం రాధ, అరుణోదయ, కవిత, శకుంతల, బాల వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

అలంపూర్ రూరల్: అలంపూర్, క్యాతూర్ పీహెచ్‌సీలో నాల్గోరోజు కంటి వెలుగు కొనసాగింది. అలంపూర్‌లో మొత్తం 150 మంది, క్యాతూర్ పీహెచ్‌సీలో మొత్తం 150 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో పర్యవేక్షణ అధికారి డాక్టర్ ప్రసూనరాణి, డాక్టర్ హేమమానస, డాక్టర్ రామస్వామి, మండల ఆరోగ్య విస్తరణాధికారి లక్ష్మీకాంత్, హెచ్‌ఏ బాలీశ్వరయ్య, పాల్గొన్నారు.

గట్టు: మండలంలోని తుమ్మలపల్లిలో కంటివెలుగును జెడ్పీటీసీ బాసు శ్యామల ప్రారంభించారు. కార్యక్రమంలో ససర్పంచు రాయుడు, పంచాయతీ కార్యదర్శి స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

మానవపాడు: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరంలో 157 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. 68 మంది కళ్ల అద్దాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమణరావు, డాక్టర్ రిజ్వాన తాన్విర్, సర్పంచ్ హైమావతి, సత్యానారాయణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధరూరు: మండలంలోని ఉప్పేరులో కంటి పరీక్షలు నిర్వహించారు. మొత్తం నాలుగు రోజుల్లో ఉప్పేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మొత్తం 688 మందికి పరీక్షలు నిర్వహించారు. అందులో 166 మందికి కళ్ల అద్దాలు అందజేశారు. అదేవిధంగా మండలంలోని బూరెడ్డిపల్లిలో కంటివెలుగు కేంద్రాన్ని సర్పంచ్ బండ్ల జ్యోతి పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యులు ఏంజిల్, రాజు, మణిశ్వరి, సూపర్‌వైజర్ విజయ్ భాస్కర్, ఏఎస్‌ఎం రాధ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మల్దకల్: మండల కేంద్రంతో పాటు నీలిపల్లి గ్రామాల్లో ఎంపీడీఓ కృష్ణయ్య కంటి వెలుగు కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ స్వరూపరాణి, సర్పంచులు ప్రకాష్, యాకోబు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గట్టులో కంటి వెలుగును ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ బాసు శ్యామల



అలంపూర్‌లో కంటి పరీక్షలు చేయించుకుంటున్న కౌన్సిలర్ జయలక్ష్మి